# అవినీతి నిర్మూలన

చట్టబద్ధమైన ప్రవర్తన నీతి. చట్ట విరుద్ధమైన ప్రవర్తన అవినీతి. సర్వజనుల సుఖం కోసం ఉపయోగించాల్సిన అధికారాన్ని వ్యక్తిగత లాభంకోసం ఉపయోగించుకోవడమే అవినీతి.అవినీతి వలన ప్రభుత్వం నిర్వీర్యమైపోతుంది. ప్రజలు కడగండ్లపాలవుతారు. ఈ అవినీతి ఒక అంటువ్యాధి. ఇటువంటి అవినీతిని వ్యతిరేకించి ప్రజాసంక్షేమానికి కృషిచేయడమే అవినీతి నిర్మూలనం.

ప్రపంచవ్యాప్తంగా నిర్వహించిన సర్వే ప్రకారం అతితక్కువ అవినీతిగల దేశాలుగా ఐర్లాండ్, ఫిన్‌లాండ్ ఘనత వహించగా, భారత్ 88వ స్థానంలోవుంది. అవినీతి ఏ ఏటికాయేడు పెరగడమేకాని, తరగడంలేదని ప్రజలు ఘోషిస్తున్నారు. ఇక రాష్ట్రాలవారీగా అవినీతి లెక్కలకొస్తే కేరళలో అతితక్కువగాను, బీహారులో అతి ఎక్కువగాను వుంది. ఆంధ్రప్రదేశ్ అవినీతిలో నాల్గవస్థానంలో వుంది.

**అవినీతికి గల కారణాలు :**

1.అవిద్య.

2.సమాచారలోపం.

3.ఎన్నికలు సజావుగా జరగక పోవడం.

4.కఠిన శిక్షలు లేకపోవడం.

5.చట్టసభల సభ్యులలో అవినీతిపరులుండడం..... మొదలైనవి.

**అవినీతి నిర్మూలనకు చేపట్టవలసిన కార్యక్రమాలు :**

**1.విద్య** : దేశంలో అక్షరాస్యతాశాతాన్ని పెంచాలి. ప్రజలు విద్యావంతులైనప్పుడే అవినీతిని ఎదుర్కోగలుగుతారు. ఉదాహరణకు కేరళరాష్ట్రం.

**2.సమాచార హక్కు చట్టం అమలు :** ప్రభుత్వం, మంత్రులు, అధికారులు సమాచారాన్ని పూర్తిగా ప్రజలకందించే పరిస్థితి ఏర్పడాలి. అప్పుడే అవినీతి నిర్మూలనం జరుగుతుంది. అంటే సమాచార హక్కు చట్టం చక్కగా అమలుకావాలి.

**3.ఎన్నికలు సజావుగా నిర్వహించడం :** ఎన్నికల సమయంలో విచ్చలవిడిగా ధనం ఖర్చుచేసి, మద్యాన్ని ఏఱుల్లా పారించి ఓటర్లను ప్రభావితం చేస్తున్నారు. ప్రజాస్వామ్యదేశంలో ఓటు విలువ, ఎన్నికల ప్రాముఖ్యతను ప్రజలకు వివరించి, వారిలో చైతన్యస్ఫూర్తిని కలిగించాలి.

**4.కఠిన శిక్షలు అమలు జరపటం:** అవినీతి పరులకు కఠినమైన శిక్షలు సత్వరం అమలుజరగాలి. అప్పుడే అవినీతి నిర్మూలనం జరుగుతుంది.అలాగే శిక్షలు ప్రజల సమక్షంలో, బహిరంగంగా జరగాలి. అప్పుడే ప్రజలకు భయం వుంటుంది.కావున ఆ దిశగా శిక్షలు అమలు చేయడానికి ప్రయత్నించాలి.

**5.నీతిపరులను నాయకులుగా ఎన్నుకోవడం** : చటసభల్లో సభ్యులు నీతిపరులై ఉండాలి. అప్పుడే అవినీతిని పారద్రోలవచ్చు. **"కంచే చేను మేసినట్లు"** మన నాయకులు, చట్టాలను తయారుచేసే సభ్యులే అవినీతిలో కూరుకుపోతే ఇక ప్రజలకు దిక్కెవరు.ప్రస్తుతం మన రాష్ట్రంలో పాలకులు ఎన్నో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఇది చాలా దురదృష్టకరం.

అవినీతి నిర్మూనలో ప్రతియొక్కరు భాగస్వాములుకావాలి. బాధ్యతగల పౌరులుగా ప్రతియొక్కరు వ్యవహరించాలి. ముఖ్యంగా యువత, విద్యార్థులు నడుంబిగించాలి. ప్రజల్లో చైతన్యం కలిగించాలి. అవినీతి రహిత సమాజస్థాపనకు విద్యార్థులమైన మనందరం కృషిచేద్దాం...!

"బాధ్యతగా వ్యవహరిద్దాం ! అవినీతి నిర్మూలనకు నడుం బిగిద్దాం !!"